Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

టీమీడియా ప్రత్యేక ఎడిషన్



# కౌన్సిలర్‌గానే పని సంతృప్తినిచ్చింది

## ⏭ దివ్యాంగుల కోసం ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేశాం

## ⏭ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతో అభివృద్ధి సాధ్యమైంది

## ⏭ టీ మీడియాతో మాజీ కార్పొరేటర్ ఎస్.కే. మక్బూల్ ఇంటర్వ్యూ








**టీ మీడియా, ఖమ్మం ప్రత్యేక ప్రతినిధి:** వామపక్ష నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చి, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి, ఖమ్మం మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రజల గొంతుకగా నిలిచిన మాజీ కార్పొరేటర్ ఎస్.కే. మక్బూల్ తన రాజకీయ ప్రయాణం, ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ రాజకీయాలపై టీ మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా టీ మీడియా (తెలుగు డిజిటల్) 11వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యం, సిబ్బంది, పాఠకులు, వీక్షకులు, ప్రేక్షకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

**ప్ర: రాజకీయ ప్రవేశం ఎలా జరిగింది?**

జ:వామపక్ష భావజాలంతోనే నా రాజకీయ ప్రయాణం ప్రారంభమైంది. సీపీఎం, ప్రజా సంఘాల్లో పనిచేశాను. స్థానిక సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించాను. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, గృహాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు వంటి ప్రజా సమస్యలపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహించి ఫలితాలు సాధించాం. అదే స్ఫూర్తితో నేటికీ ప్రజలతో మమేకమై రాజకీయంగా కొనసాగుతున్నాను.

**ప్ర: మున్సిపల్ కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పనిచేశారు. ఏ పదవి ఎక్కువ సంతృప్తినిచ్చింది?**

జ:ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధిగా నేను ఎప్పుడూ పదవిని హోదాగా భావించలేదు. ప్రజల బాధ్యతగా తీసుకున్నాను. కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు ప్రజలు నన్ను సులభంగా కలిసేవారు. నేను కూడా వారిని తరచూ కలిసి సమస్యలు తెలుసుకునేవాడిని. ఆ సమయంలో చేసిన సేవే నాకు నిజమైన సంతృప్తినిచ్చింది. కార్పొరేటర్‌గా ఎన్నికైన తర్వాత ప్రజలు ఎమ్మెల్యేను చూసినట్లుగా కొంత దూరంగా ఉండటం ప్రారంభించారు. నేను వెళ్లినా పెద్ద హోదాలో ఉన్న వ్యక్తిలా భావించారు. అందుకే కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో కౌన్సిలర్‌గా పొందినంత సంతృప్తి కలగలేదు.

**ప్ర: నిధులు రాబట్టడంలో, అభివృద్ధి పనులు చేయించడంలో మీరు ముందుంటారనే పేరుంది కదా?**

జ:మా డివిజన్ కంటే ఎక్కువ నిధులు తెచ్చిన కార్పొరేటర్లు కూడా ఉన్నారు. అయితే మా డివిజన్‌లో చేసిన కొన్ని పనులు ప్రత్యేకంగా నిలిచిపోతాయి. ఎస్పీ ఆఫీస్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న పార్కును ఆధునీకరించాం. అందులో దివ్యాంగుల కోసం ప్రత్యేక వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశాం. హైదరాబాద్ తర్వాత ఖమ్మంలోనే అలాంటి సౌకర్యం మా 23వ డివిజన్‌లో ఏర్పాటు కావడం విశేషం. బ్రెయిలీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఈ పార్కును చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూడా దివ్యాంగులు వస్తుంటారు. ఈ పని చిరస్థాయిగా గుర్తుండిపోతుంది.

అదే విధంగా సీసీ రోడ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి అనేక పనులు చేశాం. అభివృద్ధికి అవసరమైన నిధులు మున్సిపల్ కంటే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచే ఎక్కువగా వచ్చాయి.

**ప్ర: అప్పటి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారం ఎలా ఉండేది?**

జ:మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారి సహకారంతోనే ముస్తఫానగర్ సెంటర్ ఆధునీకరణ, సుందరీకరణ వంటి అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు వచ్చాయి. ఆయన సహకారం వల్లే అనేక పనులు పూర్తి చేయగలిగాం.

ఆయనకు కూడా వామపక్ష నేపథ్యం ఉంది. ప్రస్తుతం వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ, ప్రజా సమస్యల విషయంలో వామపక్ష భావజాలం మాలో ఉండేది. అదే మమ్మల్ని మరింత దగ్గర చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడింది.

**ప్ర: ప్రస్తుతం మాజీ కార్పొరేటర్‌గా ప్రజలతో అనుబంధం ఎలా ఉంది?**

జ:రాజకీయాలు ఎన్నికల వరకే. నేను స్థానిక నివాసిని. మొదటి నుంచీ ప్రజలతోనే మమేకమై ఉన్నాను. ఇప్పటికీ ప్రజలు నన్ను తమ మనిషిగానే భావిస్తారు. వీధి లైట్లు వెలగకపోయినా, కాలువలు శుభ్రం కాకపోయినా, ఏ సమస్య వచ్చినా నాకు ఫోన్ చేస్తుంటారు. ఇంటికీ వచ్చి కలుస్తుంటారు. నా వంతు సహాయం ఎప్పటికీ చేస్తూనే ఉంటాను.

**ప్ర: వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తారా?**

జ:పోటీ చేయాలా లేదా అనేది ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత నిర్ణయిస్తాం. ప్రస్తుతం ఆ చర్చ అవసరం లేదు. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం... నా తుది శ్వాస వరకు ప్రజల మనిషిగానే ఉంటాను.







